COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: apcpim@gmail.com

విజయవాడ,
14 జూన్, 2023.

**శ్రీయుత కె.ఎస్.జవహర్ రెడ్డి గారికి,**
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

ఈరోజు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీయుత జవహర్ రెడ్డి గారిని సిపిఐ(యం) డెలిగేషన్ మరియు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావుతో కలిసి 13 డిమాండ్లతో కూడిన మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఆయన స్పందిస్తూ పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తక్షణమే ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ లేఖను ప్రచురణార్థం/ ప్రసారార్థం పంపుతున్నాము. - జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

**విషయం : సిపిఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ కమిటీ తరపున జూన్ 20 నుండి జూలై 4 వరకు సాగే పోలవరం నిర్వాసితుల మహాపాదయాత్ర గురించి, పాదయాత్ర కోర్కెలు పరిష్కరించమని కోరుట గురించి...**

**అయ్యా!**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యపై మహాపాదయాత్ర ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామం నుండి ప్రారంభమవుతుంది. వందలాది మందితో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు విలీన మండలాలను కలుపుతూ జరిగే ఈ యాత్ర ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుకునూరు మండలాల్లో ప్రవేశించి జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, జంగారెడ్డి గూడెం మండలాల మీదుగా ఏలూరు, హనుమాన్‌జంక్షన్, గన్నవరంల మీదుగా విజయవాడ వరకు కొనసాగుతుంది. విజయవాడలో జూలై 4న మహాధర్నాతో ముగుస్తుంది.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించుటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపించడం లేదు. నిర్వాసితుల సమస్యలు తీవ్రంగాను, దయనీయంగాను ఉన్నాయి. గత సంవత్సరం వచ్చిన వరదలలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు మండలాలు, ఏలూరు జిల్లాలోని రెండు మండలాలు వంద రోజులపాటు వరదలో ఉన్నాయి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులై నానా అగచాట్లు పడ్డాయి. ప్రభుత్వం సహాయక చర్యలు చేయలేదు. కుటుంబానికి రు.2000 చొప్పున సహాయం తప్ప నిత్యావసర వస్తువులు, నష్టపరిహారం అందించలేదు. ఈ సంవత్సరం జూన్, జూలై, ఆగస్టు నెలల్లో మరలా వరద వచ్చే ప్రమాదం ఉంది. ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 చట్టం సమగ్రంగా అమలు జరిపి పరిహారం, పునరావాసం కల్పించాలని, వరద ప్రాంత మండలాలలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని, గతంలో వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, కాంటూరు లెక్కలను శాస్త్రీయంగా రూపొందించాలని తదితర కోర్కెల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ మహా పాదయాత్ర గురించి తమరి దృష్టికి తీసుకువస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చొరవ చూపించాలని, సకాలంలో పరిష్కారం చేయాలని కోరుతున్నాము.

....2వ పేజి

కోర్కెలు :

1) నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా అమలు చేసే వరకు గ్రామాలు ఖాళీ చేయించరాదు.

2) పునరావాసం పూర్తయ్యే వరకూ ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యధా విధిగా కొనసాగించాలి.

3) 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాల రీసర్వే చేయాలి.

4) పునరావాసం దశల వారీగా కాకుండా ఏక కాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలి.

5) మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్&ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలి.

6) ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతి ఎకరాకు 20 లక్షలు చెల్లించాలి.

7) ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 10.50 లక్షల పరిహారం ఇవ్వాలి. జివో.నెం. 224 అమలుపర్చాలి.

8) గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన యువతీ, యువకులు అందరికీ ఆర్&ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. పెండ్లి అయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలి.

9) సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.

10) ముంపు ప్రాంతాల ఉద్యోగులందరిని యధాతధంగా తరలించే ప్రాంతాల్లో కొనసాగించాలి.

11) నిర్వాసితుల కాలనీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి.

12) ముంపు మండలాల్లో మునిగిపోతున్న పాఠశాలలు, కళాశాలలను పునరావాస కాలనీల్లో నిర్మించేందుకు సమగ్ర ప్రణాళిక తయారుచేయాలి.

13) నిర్వాసితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతీ డివిజన్ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలి.

అభివందనములతో...

S/d
**(మంతెన సీతారాం)**
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**(వి.వెంకటేశ్వర్లు)**
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు